క్లుప్తంగా

మేడారం అర్చకుల ప్రత్యేక పూజలు



పూజలకు హాజరైన మేడారం ప్రధాన అర్చకులు

సికింద్రాబాద్: మేడారం సమ్మక్క, సారలమ్మ దేవాలయ ప్రధాన అర్చకులు ఆదివారం సికింద్రాబాద్ నగరంలో అమ్మవారి పూజలు నిర్వహించారు. బౌద్ధనగర్‌లో మేడారం దేవాలయ ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు సంజీవ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో సమ్మక్క, సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలకు ముఖ్య అతిథులుగా సమ్మక్క, సారలమ్మ ఆలయ ప్రధాన అర్చకులు కాకా సారయ్య, సందరి గోపాల్ హాజరయ్యారు. వీరిరువురి నేతృత్వంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పోలు సమంత, విజయ్‌ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పూలే జయంతి కమిటీ వైస్ చైర్మన్‌గా మణిమంజరి



సికింద్రాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్‌గా సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండికి చెందిన బి.మణిమంజరి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పూలే జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. తాను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు పూలే జయంతి వేడుకల కమిటీ వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్, బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలను చైతన్య పరిచిన విప్లవ యోధుడు కానూరి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తన పాటల ద్వారా ప్రజలను చైతన్య పరిచిన గొప్ప విప్లవ యోధుడు, ఆదర్శ కమ్యూనిస్టు కానూరి వెంకటేశ్వర్‌రావు అని ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్టు సతీష్‌చందర్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరుణోదయ సంస్కృతిక సమైక్య ఆధ్వర్యంలో ఆయన 8వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సతీష్‌చందర్ మాట్లాడుతూ.. అరుణోదయ వ్యవస్థాపకులుగా తన కలం ద్వారా ఎన్నో కథలు రాసి, పాటలను అల్లి ప్రజలను చైతన్యం చేశారని కొనియాడారు. పీఓడబ్ల్యూఎస్ జాతీయ కన్వీనర్ పి.సంధ్య, అరుణోదయ సంస్కృతిక సమైక్య అధ్యక్షులు వేణు, సీనియర్ జర్నలిస్ట్ వెంకన్న, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్మల, కానూరి కుమార్తె అరుణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనురాధా, కె.గణేష్ తదితరులున్నారు.

ఇతరులకు సహాయ పడటంలో అంతులేని ఆనందం



కవాడిగూడ: ఇతరులకు సహాయం చేయడంలో అంతులేని ఆనందం ఉంటుందని రామకృష్ణ మఠం స్వామి శితికంఠానంద అన్నారు. ఆదివారం రామకృష్ణ మఠంలో వివేకానంద ఆరోగ్య కేంద్రాన్ని రోటరీ గ్లోబల్ చాంపియన్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో డెంటల్ చైర్‌ను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. డబ్బు సంపాదన కంటే సంపాదించిన దానిలో కొంత సాయం చేయడం ఉత్తమమన్నారు. రోటరీ డిస్ట్రిక్ సెక్రటరీ డాక్టర్ ఎస్.వీ. రామ్‌ప్రసాద్, రోటరీ గ్లోబల్ చాంపియన్స్ అధ్యక్షుడు నర్సింహ మేధ కోటారు, కార్యదర్శి సామశాస్త్రి, కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు ఈశ్వరి, హరినాథ్, కర్ణ, జై శ్రీనివాస్, మహేష్‌పాటిల్, వివేకానంద, ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జ్ డాక్టర్ అనుపమ, డాక్టర్ వందన, వాలంటీర్లు ప్రేమ్‌కుమార్, నీతేశానంద తదితరులున్నారు.

ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం

ముషీరాబాద్: ప్రజా సమస్యలను తెలుసుకుని వాటికి శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రావులపాటి మోజెస్ అన్నారు. రాంనగర్ డివిజన్ దయారా మార్కెట్ ప్రాంతంలో ఆదివారం ఆయన నాయకులతో కలిసి పర్యటించారు. మురుగు సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా.. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిత్యం కాలనీలు, బస్తీలలో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు.

మర్రికే పగ్గాలు

- కంటోన్మెంట్ ఇన్‌చార్జ్‌గా ప్రకటించిన బీఆర్ఎస్ అధిష్ఠానం
- వర్గపోరుకు చెక్ పెడుతూ కీలక నిర్ణయం గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహం



మర్రి రాజశేఖర్‌రెడ్డికి మిఠాయిలు తినిపిస్తున్న నాయకులు

కంటోన్మెంట్: ఎట్టకేలకు బీఆర్ఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ను నియమించారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డికి నియోజకవర్గ బాధ్యతలు కూడా అప్పగించారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఆదివారం అంతర్గత ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ విషయంలో కొనసాగుతున్న ఆధిపత్య పోరుకు తెరపడినట్లయింది. స్థానిక ఎమ్మెల్యే సాయన్న హఠాన్మరణంతో పార్టీ శ్రేణులను ఏకతాటిపై నడిపే వారు కరువయ్యారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో పార్టీ టికెట్ ఆశిస్తున్న నేతల మధ్య ఆధిపత్య పోరుతో పార్టీ కేడర్‌లో గందరగోళం నెలకొంది. అదే సమయంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనదైన శైలిలో క్యాడర్‌ను తనవైపునకు తిప్పుకునే ప్రయత్నాలు చేశారు. దీంతో సహజంగానే పార్టీలో వర్గ విభేదాలు ఒక్కసారిగా బహిర్గతం అయ్యాయి. ఈ ప్రభావం ఆత్మీయ సమ్మేళనాలపై పడటంతో రెండు సార్లు ఆత్మీయ సమ్మేళనాల షెడ్యూల్‌ను మార్చాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం ఆత్మీయ సమ్మేళనాలు సహా నియోజకవర్గ పార్టీ బాధ్యతలను పూర్తిగా మర్రి రాజశేఖర్ రెడ్డికి అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

అసమ్మతికి చెక్ పెట్టేందుకే..

స్థానిక ఎమ్మెల్యే సాయన్న మరణంతో కంటోన్మెంట్ బీఆర్ఎస్‌లో ఆధిపత్య పోరు రోజురోజుకీ పెరుగుతూ వచ్చింది. సాయన్న వారసురాళ్లు లాస్య నందిత, నివేదితల్లో ఎవరో ఒకరికి పార్టీ బాధ్యతలు అప్పగించాలంటూ సాయన్న వర్గీయులు పట్టుపట్టారు. పార్టీ కార్యక్రమాల్లో తమకూ తగిన ప్రాధాన్యం కల్పించాలంటూ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్, గజ్జెల నాగేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌లతో పాటు శ్రీగణేశ్ డిమాండ్ చేస్తూ వచ్చారు. మంత్రి తలసాని ఆదినుంచీ తనకు అనుకూలంగా ఉంటూ వచ్చిన వారికి ప్రాధాన్యమిస్తూ ఆత్మీయ సమ్మేళనాలకు రంగం సిద్ధం చేశారు. ఆయా సమావేశాలకు మర్రి రాజశేఖర్ రెడ్డిని పక్కన పెడుతూ ఉండటంతో ఆయన వర్గీయుల్లో ఆందోళన మొదలైంది. ఈ కారణంతోనే ఆత్మీయ సమ్మేళనాల షెడ్యూల్‌లను మార్చుతూ వచ్చారు.ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే అసమ్మతి మరింత పెరిగే ప్రమాదముందని భావించిన అధిష్ఠానం ఎట్టకేలకు మర్రిని ఇన్‌చార్జ్‌గా నియమించాలనే నిర్ణయం తీసుకుంది.

సమస్యల పరిష్కారానికి పోరాటం..

2019 పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన మర్రి రాజశేఖర్ రెడ్డి వివాద రహితుడిగా గుర్తింపు పొందారు. స్థానిక ఎమ్మెల్యే సాయన్నకు చేదోడువాదోడుగా ఉంటూ పార్టీ శ్రేణులకు పెద్ద దిక్కుగా ఉంటూ వచ్చారు. కేంద్ర ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యంలో పాలన సాగే కంటోన్మెంట్‌లో వివిధ సమస్యలపై నిరంతర పోరాటాలను కొనసాగిస్తున్నారు. ఓట్ల తొలగింపు, రూ.700 కోట్లు దాటిన సర్వీసు ఛార్జీల బకాయిలు, లాల్‌బజార్ డంపింగ్ యార్డు, సివిల్ ఏరియాల్లో స్థానికులకు యాజమాన్య హక్కులు ఇలా అనేక పోరాటాలు చేస్తూ వచ్చారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రూపు రాజకీయాలకు తావివ్వొద్దన్న నేపథ్యంలోనే మర్రికే పార్టీ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.

బస్తీ సమస్యల పరిష్కారానికే 'బస్తీనిద్ర'



కాలనీ వాసులకు చెక్కు అందజేస్తున్న క్రిశాంక్

కంటోన్మెంట్: బస్తీ బాధలు తెలుసుకుని పరిష్కరించేందుకు 'బస్తీనిద్ర'కు శ్రీకారం చుట్టానని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. నాలుగో వార్డు గాంధీ కాలనీలో మూడో బస్తీనిద్ర అనంతరం ఆదివారం ఆయన బస్తీవాసులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. కంటోన్మెంట్ బోర్డు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న తమ బస్తీలో నాలుగైదు రోజులకోసారి మాత్రమే తాగునీరు సరఫరా అవుతుందని జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద నిర్మించిన ఇళ్లకు విద్యుత్ అధికారులు మీటర్లు ఇవ్వడం లేదని స్థానికులు ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం క్రిశాంక్ మాట్లాడుతూ.. తాగునీటి సమస్యపై బోర్డు అధికారులతో చర్చించి పరిష్కారం చూపుతానని అదే విధంగా విద్యుత్ అధికారులతో మాట్లాడి మీటర్లు వచ్చేలా కృషి చేస్తానన్నారు. బస్తీ ఆవరణలోని మైసమ్మ ఆలయ కమాన్ కోసం ఆయన రూ. లక్ష చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గాంధీ కాలనీ అధ్యక్షులు రాజేందర్, ఎండీ ఇస్మాయిల్, ప్రభాకర్, సాయి, విజయ్, హరిబాబు, నర్సింగ్ రావు, మోని, రఘు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఏర్పాటుకు అధికారులు సహకరించాలి



రిలే దీక్షను ప్రారంభిస్తున్న ఆలకుంట హరి

లాలాపేట: చేయిచేయి కలుపుదాం ఆస్పత్రిని నిర్మిద్దామంటూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో వడ్డెరబస్తీ కమాన్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారంతో 5వ రోజుకు చేరుకుంది. మాణికేశ్వర్‌నగర్ మ్యారేజ్ సొసైటీ సంఘం నాయకులు ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తూ దీక్ష చేపట్టారు. ఆదివారం బీఆర్ఎస్ యూత్ వింగ్ గ్రేటర్ అధ్యక్షులు ఆలకుంట హరి దీక్షలో పాల్గొని మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు అన్యాక్రాంతమవుతున్న ఓయూ భూములను పరిరక్షించకుండా పెద్దపెద్ద వారికి లీజుల పేరుతో ఎంతో విలువైన భూములను చౌకగా అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల నిర్మాణానికి కార్మికులుగా నాడు పని చేసిన వడ్డెరలకు ఓయూ పక్కనే నివాసాల కోసం కొంత స్థలాన్ని కేటాయించిందన్నారు. ప్రస్తుతం ఉన్న అధికారులు ఆ భూమి తమదంటూ ఖాళీ స్థలంలో హాస్పిటల్‌ను ఏర్పాటు చేసుకుంటామంటే మోకాలడ్డుతూ వడ్డెర బస్తీ ప్రజల పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని త్వరలో రాష్ట్ర గవర్నర్‌ను కలిసి విన్నవిస్తామన్నారు. దీక్షలో వెంకటేశ్వర్‌రావు, బోదాసు యాదగిరి, గుర్రం వెంకటేష్, జి. నర్సింహ్మ, ఒర్సు కృష్ణ, యాదయ్య, తిరుపతి, సత్యనారాయణ, ప్రసాద్, నాగరాజు, మల్లేష్, శ్రీను, శ్రీనివాస్, కాశీం, ఉపేందర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



ఈస్టర్ గీతాలను ఆలపిస్తున్న దృశ్యం



సీఎస్ఐ క్రైస్ట్ చర్చిలో..

లాలాపేట: ఈస్టర్ సండే వేడుకలను ఆదివారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. తార్నాకలోని ఐనోస్ చర్చి, బాప్టిస్టు చర్చి, లాలాపేటలోని లోగోస్ గాస్పెల్ చర్చి, మెథడిస్టు చర్చి, ఎవాంజలికల్ బాప్టిస్టు చర్చిలలో ఉదయం 5 గంటల నుంచి సందడి నెలకొంది. శిలువపై చనిపోయిన యేసు క్రీస్తు మూడవ దినం తిరిగి లేచాడని జయ గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఆర్. విలియం కేరి మాట్లాడుతూ.. రెండు వేల సంవత్సరాల క్రితం యేసు క్రీస్తు మరణాన్ని జయించాడని సందేశాన్ని ప్రకటించారు. శిలువపై మరణించి మూడవ దినమున తిరిగి లేచాడని అదే ఈస్టర్ అన్నారు.

అడ్డగుట్ట డివిజన్‌లో..

అడ్డగుట్ట: ఈస్టర్ సండే వేడుకలను ఆదివారం అడ్డగుట్ట డివిజన్ పరిధిలోని క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా సీఎస్ఐ క్రైస్ట్ చర్చిలో జరిగిన వేడుకల్లో రెవరెండ్ డా. ప్రసన్న కుమార్ యేసు క్రీస్తు పునరుత్థాన సందేశాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ జాక్వేలైన్ కుమార్, చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'జింఖానా'లో హునార్ మహోత్సవ్

రసూల్‌పురా: కళాకారులు, చేతి పనివారులకు ప్రోత్సాహం అందించేందుకు దమలాంగ్ హునార్ మహోత్సవ్ పేరుతో సికింద్రాబాద్ జింఖానా మైదానంలో నేటి నుంచి పది రోజుల పాటు మలాంగియా ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం జింఖానా మైదానంలో జరిగిన మీడియా సమావేశంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రిషికుమార్ ఝా వివరాలు వెల్లడించారు. హ్యునర్ మహోత్సవ్‌లో దేశంలోని 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 250కు పైగా కళాకారులు, చేతి పనివారులు రూపొందించిన వస్తువుల ప్రదర్శన ఉంటుందన్నారు. వోకల్ ఫర్ లోకల్, ఆత్మ నిర్భర్ భారత్ స్ఫూర్తితో స్వదేశీ తయారీ ఉత్పతులలో అప్లిక్ వర్క్స్, జ్యూట్ కేన్, ఉడేన్, లక్క గాజులు, రాజస్థానీ ఆభరణాలు, పుల్కారీ లెదర్ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ఉదయం పది గంటల నుంచి రాత్రి పదింటి వరకు ప్రవేశం ఉచితమన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న రిషికుమార్ ఝా

ఆరోగ్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనాన్ని రూ.26 వేలు చెల్లించాలని టీఏ, డీఏ వర్తింపజేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆరోగ్య మిత్రల ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ.. ఆరోగ్యమిత్రలను స్కిల్ ఎంప్లాయిస్‌గా గుర్తించి అర్హతకు తగినట్లుగా వెంటనే క్యాడర్‌ను మార్పు చేయాలన్నారు. షఫిలింగ్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన కోరారు. పీహెచ్‌సీ ఆరోగ్య మిత్రలను తిరిగి పీహెచ్‌సీలోనే విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని విధి నిర్వహణలో మరణించిన వారికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య మిత్రల ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య, ప్రధాన కార్యదర్శి కుమార్, రాష్ట్ర నాయకులు శ్రీధర్ తదితరులున్నారు.

బీజేపీకి బీసీలు వెన్నెముక

అంబర్‌పేట: బీజేపీ పార్టీకీ బీసీలు వెన్నెముక అని ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చిన రమేష్ ఆధ్వర్యంలో 'పల్లె పల్లెకు ఓబీసీ- ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమం నిర్వహించి స్థానికులకు కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డితో కలిసి గౌతంరావు హాజరై మాట్లాడారు. బీజేపీ అనుబంధ విభాగాలను మరింత పటిష్టం చేసేందుకు పార్టీ ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. సమిష్టిగా కష్టపడి రాబోయే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఓబీసీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు వినోద్ యాదవ్, నాయకులు ఆనంద్‌గౌడ్, వెంకటేష్, రవీందర్, అజయ్‌కుమార్, రంగంపల్లి రాజు, మిరియాల శ్రీనివాస్, టీ.వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఎస్.గౌతంరావు తదితరులు

రైల్వేస్టేషన్‌లో బిహార్ వాసి మృతి

సికింద్రాబాద్: అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన దేవాసింగ్ (57) అనారోగ్యానికి గురై చికిత్స నిమిత్తం తన కుమారుడితో రైలులో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. 8వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఉండగా అప్పటికే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

'దళితులను విస్మరిస్తున్న బీఆర్ఎస్'

లాలాపేట: అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుతో పేద దళితుల బతుకులు మారవని, వారికి నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే వారి బతుకులు మారుతాయని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ మేధావి డా. అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణను ఆయన మనవడు ప్రకాష్ అంబేద్కర్ చేతుల మీదుగా చేయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గత పదేళ్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదని ఆరోపించారు. దళిత ముఖ్యమంత్రి నుంచి మొదలుకుంటే దళితులకు మూడెకరాల భూమి, దళితుల ఆత్మరక్షణ చట్టాలు అమలు చేయకుండా ఇలా అన్ని రకాలుగా దళితులను వంచించిన చరిత్ర భారత రాష్ట్ర సమితికే దక్కుతుందన్నారు. చిత్తశుద్ధి ఉంటే వచ్చే ఆరు నెలల్లో దళితుల అభివృద్ధికి బీఆర్ఎస్ నిరంతరం కృషి చేయాలని డిమాండ్ చేశారు.



ప్రొ. గాలి వినోద్‌కుమార్



సైక్లథాన్‌లో పాల్గొన్న బైస్కిల్ క్లబ్ సభ్యులు

ఉత్సాహంగా సైక్లథాన్

సనత్‌నగర్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అమీర్‌పేటలోని యోధ డయాగ్నస్టిక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సైక్లథాన్ ఉత్సాహంగా జరిగింది. హైదరాబాద్ బైస్కిల్ క్లబ్ సభ్యులతో పాటు సంస్థ ఉద్యోగులు, సిబ్బంది దాదాపు 200 మంది ఇందులో పాల్గొన్నారు. అమీర్‌పేట నుంచి ప్రారంభమైన సైక్లథాన్ బేగంపేట, సోమాజిగూడ, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు మీదుగా 22 కిలో మీటర్లు సాగిన కార్యక్రమాన్ని సంస్థ చైర్మన్ కంచర్ల సుధాకర్ జెండాఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధగా ఉండాలని, శరీరానికి అవసరమైన ఆహార పదార్థాలను తీసుకోవడంతో పాటు శారీరక వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు. ఆరోగ్యంపై అందరికీ అవగాహన కల్పించేందుకు తాము ఈ సైక్లథాన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బైస్కిల్ క్లబ్ అధ్యక్షుడు రవీందర్, సంస్థ ఎండీలు రఘు, వెంకట్, గౌతం, సీఓఓ డాక్టర్ కిరణ్ కుమార్, ల్యాబ్ డైరెక్టర్ మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బెలూన్లను ఎగురవేసి సైక్లథాన్ ప్రారంభిస్తున్న దృశ్యం

అన్ని మతాల పండుగలకు సమ ప్రాధాన్యం

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



రంజాన్ తోఫా అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్

కంటోన్మెంట్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని పండుగలను గొప్పగా నిర్వహిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రంజాన్ సందర్భంగా ప్రభుత్వం తరఫున అందించే రంజాన్ తోఫాలను ఆదివారం ఆయన అందజేసి మాట్లాడారు. పండగలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతోనే రంజాన్ సందర్భంగా పేద ముస్లింలకు నూతన దుస్తులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్రిస్మస్‌కు క్రిస్టియన్‌లకు, బతుకమ్మ సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. రంజాన్ సందర్భంగా ప్రతి సంవత్సరం ముస్లింలకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నారని అందులో భాగంగా ఈ నెల 12న ఎల్‌బీ స్టేడియంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందుకు సీఎం కేసీఆర్ హాజరవుతారన్నారు. అదే విధంగా నియోజకవర్గ పరిధిలోని 6 డివిజన్లలోనూ ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలన్ లక్ష్మి, హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు నామన శేషుకుమారి, అత్తిలి అరుణగౌడ్, నేతలు అజయ్ కుమార్, సంతోష్ యాదవ్, ఖలీల్, యాసిన్, ఫహీం, నోమాద్దిన్, అష్రఫ్, అఖిల్, అబ్బాస్ పాల్గొన్నారు.

హాస్టళ్ల నిర్వాహకులకు అండగా ఉంటా..

సనత్‌నగర్: హాస్టళ్ల నిర్వాహకులకు ఎలాంటి సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని మంత్రి తలసాని అన్నారు. అమీర్‌పేటలోని గురుగోవింద్ సింగ్ స్టేడియంలో హాస్టల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశానికి మంత్రి హాజరై మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారాలు, ఉద్యోగాలు చేసుకుంటున్న వారిలో ఒక అభద్రతా భావాన్ని కల్పించేలా ఉద్యమ సమయంలో తప్పుడు ప్రచారాలను కల్పించారని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ అనుమానాలను కొట్టిపారేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కరోనా సమయంలో హాస్టళ్లు మూసివేయాల్సి వచ్చిందని, అద్దె విషయంలో హాస్టళ్ల నిర్వాహకులు, భవన యజమానులకు కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. ఆ సమస్యను తాను పరిష్కరించిన విషయాన్ని గుర్తుచేశారు. విద్య, ఉద్యోగం కోసం నగరానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారి కోసం హాస్టళ్లను ఏర్పాటుచేసి వసతి, భోజనం సౌకర్యాలు కల్పిస్తున్న నిర్వాహకులను అభినందించారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ ఎస్.శేషుకుమారి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు, సభ్యులు అనిల్, మారుతి, రాజశేఖర్, దుర్గ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379